కథాకేళి

# అర్ధరాత్రి అతిథి



## మల్లాది వెంకటకృష్ణమూర్తి

"మా అమ్మ ఆరోగ్యం ఏ మాత్రం బావున్నా ఎల్లుండి సాయంత్రానికల్లా తిరిగి వచ్చేస్తానండీ. మీరు రాత్రిళ్ళు బయట తిరగకుండా త్వరగా ఇంటికెళ్ళండి" చెప్పింది విశ్వామిత్ర భార్య అతనితో.

"అలాగే. టెలిగ్రాం ఇవ్వలేదు. ఊరికే లెటర్ రాశారంటే సీరియస్ అయివుండదు" తన భార్యకి ధైర్యం చెప్పాడు విశ్వామిత్ర.

బస్సు మరో అయిదు నిమిషాల్లో బయలుదేరింది. బయటకి వచ్చిన విశ్వామిత్ర ఇంటికి వెళ్ళలేదు. దగ్గరే వున్న ఓ సినిమా థియేటర్‌కి వెళ్ళి సినిమా చూసి, హోటల్‌లో భోజనం చేశాక ఇంటికెళ్ళాడు.

రోజూ భార్యతో గడిపే పక్క మీద ఒంటరిగా గడపాలంటే అతనికి వెలితిగా వుంది. నిద్ర వచ్చేదాకా 'ఇండియా టుడే' చదివాడు.

కాలింగ్ బెల్ చప్పుడికి అతనికి మెలకువ వచ్చింది. తను లైటార్పకుండానే నిద్రపోయాడని గ్రహించాడు. వాల్‌క్లాక్ వంక చూశాడు - పదకొండూ ఇరవై. ఇంత రాత్రి వేళ ఎవరొస్తారు? లేచి వెళ్ళి తలుపు తీసేలోగా ఇంకోసారి కాలింగ్ బెల్ మోగింది. తలుపు తీస్తే అవతల ఓ ముప్పై ఏళ్ళ యువతి నించుని వుంది.

"ఎవరు కావాలి?" అడిగాడు విశ్వామిత్ర.

"విశ్వామిత్రగారు మీరేనా?" అడిగింది.

"అవును. మీరు...?"

"ముందు లోపలికి రానివ్వండి."

సందేహిస్తూనే పక్కకి తప్పుకున్నాడు విశ్వామిత్ర. ఆమెని అంతకు మునుపెన్నడూ చూడలేదు అతను.

"నా పేరు మేనక" నవ్వింది.

వెళ్ళబోతూ చూస్తున్న అతనితో చెప్పింది-

"నిజం. తమాషాకి చెప్పడం లేదు నేను. మీ భార్య ఇంట్లో లేదా?" అడిగింది మేనక.

"ఊరెళ్ళింది. ఇంతకీ మీరెవరు?" అడిగాడు విశ్వామిత్ర.

"చెప్తాగాని లోపలికి వెళదాం పదండి" తలుపు మూసేసింది మేనక.

"ఇంట్లో నేను తప్ప ఇంకెవరూ లేరు" చెప్పాడు విశ్వామిత్ర ఇబ్బందిగా చూస్తూ.

"అయితే మరీ మంచిది."

"మీ వుద్దేశ్యం ఏమిటో నా కర్థం కావడం లేదు" సీరియస్‌గా చూస్తూ చెప్పాడు.

"నా వుద్దేశం అదే"

అతని మెడ చుట్టూ చేతులు వేసి విశ్వామిత్రని ముద్దుపెట్టుకుంది.

విశ్వామిత్ర ఆమెని విడిపించుకోవా లనుకున్నాడు కాని ఆమె వదల్లేదు. కొద్ది నిమిషాల్లో అతను ప్రతిఘటించడం మానేశాడు. ఇద్దరూ బెడ్‌రూంలోకి వెళ్ళారు.

అరగంట తర్వాత మేనక లేచి గ్లాసులో మంచినీళ్ళు వంచుకుని తాగి చెప్పింది తృప్తిగా-

"ఊహలే తప్ప నాకింత తెగింపు వుంటుందనుకోలేదు."

"మీరెవరో చెప్పనే లేదు నాకు?" అడిగాడు విశ్వామిత్ర.

వెంటనే మేనక మొహంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

"నా భర్త పేరు చెప్పినా మీకు తెలీదు. ఆయన హెచ్.ఎం.టి.లో పనిచేస్తున్నాడు. దాదాపు సంవత్సరంగా సాగుతోంది ఆయనకీ, మరో అమ్మాయికీ మధ్య ప్రణయం."

"అలాగా? కాని నా పేరు ఎలా తెలుసు?"

"చెప్తాను. నా భర్త నాకు చేసే అన్యాయానికి నా మనసు వుడికి పోసాగింది. ఆయన్ని వారించి ప్రయోజనం లేకపోయింది. ఈ బాధతో ఆత్మహత్య చేసుకోవాలనిపించింది కూడా. చివరికి పరిష్కారంగా నేను ఆయన చేసే తప్పు చేస్తే నా మనసుకి వుపశమనం లభిస్తుం దనిపించింది. రెండు నెలలుగా ఆలోచించి, ఆలోచించి ఈ రాత్రి ఆ ధైర్యం చేశాను. నా భర్త నాకు చేసే అన్యాయం ఆయనకే చేశాను. నాకిప్పుడు ఎంతో శాంతిగా వుంది."

"కాని మీరు అడగ్గానే నేను సరే అంటానని ఎలా అనుకున్నారు?"

"అనుకోలేదు. కానీ ఒప్పుకున్నారుగా."

"ఇంతకీ మీ భర్తకి, ఎవరితో ఆ అక్రమ ప్రణయం?" అడిగాడు విశ్వామిత్ర ఆసక్తిగా.

"మీ ఆవిడతో."

"వాట్!" అదిరిపడ్డాడు విశ్వామిత్ర.

"అవును. మీరనుకున్నట్టు ఆవిడ గోపాలపురం వెళ్ళడం లేదు బస్సులో. బస్సు దిల్‌షుక్‌నగర్‌లో దిగిపోయింది. మావారు నాతో ఈ పూట నైట్ డ్యూటీ అని అబద్ధం ఆడారు. మీ ఆవిడ రాసిన వుత్తరం నా కంటబడడంతో నాకీ నిజం తెలిసింది - వెళ్ళొస్తాను" మేనక బయటకి నడిచింది

●

